క్లుప్తంగా

ఉత్తమ సేవలందించండి



మాట్లాడుతున్న జిల్లా ఆరోగ్య కార్యక్రమాల పర్యవేక్షణాధికారి కుళ్లాయప్పనాయక్

హిందూపురం టౌన్: ఎంఎల్‌హెచ్‌పీలు, సీహెచ్ఓలు శిక్షణలో నైపుణ్యాలను మెరుగుపరుచుకుని, ఉత్తమ సేవలందించాలని జిల్లా ఆరోగ్య కార్యక్రమాల పర్యవేక్షణాధికారి కుళ్లాయప్పనాయక్ సూచించారు. జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ఎంఎల్‌హెచ్‌పీలు, సీహెచ్ఓలకు జరుగుతున్న 'హ్యాండ్ ఆన్ ట్రైనింగ్ ఫర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్' శిక్షణను ఆయన తనిఖీ చేశారు. వృత్తిని ఇష్టపడి పనిచేసినప్పుడు మెరుగైన సేవలు అందించగలమన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, నోడల్ అధికారులు వన్నప్ప, రెడ్డికుమార్‌రెడ్డి, శిక్షకులు నవిత, అమర ప్రియ, రాధిక, వనజ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను పాఠశాలల్లో చేర్పించండి

సోమందేపల్లి: బడిఈడు పిల్లలందరూ పాఠశాలలో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ శోభారాణి తెలిపారు. మండల కేంద్రమైన సోమందేపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. చిన్నారుల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఖాదర్‌వలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సీఎం అధిక ప్రాధాన్యం



విద్యార్థిని నందినిని సన్మానిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: 'ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేశారు.. విద్యార్థుల విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యతం ఇస్తున్నారు' అని వైఎస్సార్‌సీపీ నాయకులు జమ్మానిపల్లి మూర్తి, హనుమంతరాయప్ప తెలిపారు. గౌడనహళ్లి ఉన్నత పాఠశాల స్థాయిలో టెన్త్‌లో అధిక మార్కులు సాధించిన విద్యార్థిని నందినికి మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు జమ్మానిపల్లి మూర్తి నగదు బహుమతి అందించి సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రశాంత వాతావరణమే లక్ష్యం



సిబ్బందితో సమావేశమైన ఎస్‌ఐ శ్రీనివాసులు

చిలమత్తూరు: గ్రామాల్లో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పడమే లక్ష్యంగా పనిచేయాలని ఎస్‌ఐ శ్రీనివాసులు సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆయన స్థానిక పీఎస్‌లో పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులతో సమావేశాన్ని నిర్వహించారు. కాఫీ విత్ మెన్ కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా వారం రోజులుగా మండల పరిధిలో అందిన ఫిర్యాదులు, సేవలు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై సిబ్బందితో ఆయన చర్చించారు.

ఇరువర్గాల ఘర్షణ

గోరంట్ల: మండల పరిధిలోని జీనంవాండ్లపల్లిలో భూతగాదాలతో మంగళవారం గంగాధర్, లక్ష్మీపతి వర్గాల మధ్యఘర్షణ జరిగింది. ఈ ఘటనలో లక్ష్మీపతి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడగా గోరంట్ల ఆస్పత్రికి తరలించారు. లక్ష్మీపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గంగాధర్‌తో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఇక్బాల్‌బాషా తెలిపారు.

అక్రమ లేఅవుట్ల తొలగింపు



ఓ లేఅవుట్‌లోని సరిహద్దు రాళ్లను జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండల పరిధిలోని హరేసముద్రం పంచాయతీలో అనుమతి లేకుండా వేసుకున్న అక్రమ లేఅవుట్లను మంగళవారం అధికారులు జేసీబీతో తొలగించారు. మొత్తం 9 లేఅవుట్లు ఉండగా 6 లేఅవుట్లను తొలగించారు. మిగతా వాటిని కూడా తొలగిస్తామని ఎంపీడీఓ సోనిబాయి తెలిపారు. అనుమతులు తీసుకోవాలని సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసినా వారు స్పందించకపోవడంతో లేఅవుట్లను తొలగిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శైలజ, కార్యదర్శి సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

నారు పోయె.. నర్సరీ వచ్చే!

- మారిన పంటల సాగు పద్ధతి
- నర్సరీలపైనే ఆధారపడుతున్న రైతులు
- కుప్పలు తెప్పలుగా పుట్టుకొస్తున్న నర్సరీలు

రొద్దం: ఒకప్పుడు టమాట, మిరప పంటలు సాగు చేయాలంటే రైతులు ముందస్తు ఏర్పాట్లు చేసుకునే వారు. రైతుల పొలాల్లోనే వారికి కావాల్సిన నారు కోసం విత్తనం చల్లి మొక్కలయ్యాక పొలాల్లో నాటే వాళ్లు. ఈ పనుల కోసం కనీసం నెలరోజుల సమయం పట్టేది. అయితే టమాట, మిరప సాగు విస్తీర్ణం పెరగడం, తక్కువ సమయంలో పంట దిగుబడులు రావాలని అన్నదాతలు ఆరాట పడుతున్నారు. ఏడాదికి మూడు పంటలు సాగుచేసేలా రైతాంగం ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోంది. దీంతో టమాట, మిరప నారుకు బదులు రెడీమేడ్‌గా మొక్కలు సరఫరా చేసే నర్సరీలు గ్రామాల్లో కుప్పలు తెప్పలుగా పుట్టుకొచ్చాయి.

టమాట సాగులో పెనుకొండ టాప్

పెనుకొండ నియోజకవర్గం టమాట సాగులో మొదటి స్థానంలో ఉంది. ఇందులో భాగంగానే నర్సరీల్లో ఎక్కువగా టమాట నారును సిద్ధం చేసి రైతులకు అమ్ముకుంటున్నారు. పెనుకొండలో 3, రొద్దం 8, పరిగి 3, సోమందేపల్లి 1, గోరంట్లలో 10 నర్సరీలు అధికారికంగా ఉండగా.. అనధికారికంగా దీనికి డబుల్ ఉంటాయని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు.

పాత పద్ధతికి స్వస్తి

15 ఏళ్ల క్రితం టమాట, మిరప నర్సరీల మాటేలేదు. టమాట, మిపర సాగు చేసుకునే రైతులు తమ పొలాల్లో టమాట, మిరప విత్తనాలు చేల్లే వారు. 20 నుంచి 30 రోజుల మధ్యలో టమాట, మిరప నారుగా మారి మొక్కలయ్యేవి. ఈ మొక్కలను రైతులు పొలాల్లో నాటుకునే వారు. ఒక రైతు ఎక్కువ నారు తీస్తే రైతులకు అరువుగా మొక్కలను ఇచ్చేవాళ్లు. ఒకరికొకరు సహకరించుకుంటూ రైతులు పంటలను సాగు చేస్తుండేవాళ్లు. ఇప్పుడు రైతాంగం మొత్తం నర్సరీలపై ఆధారపడి మొక్కలను కొనుగోలు చేస్తున్నారు.

మొక్కను బట్టి ధరలు

నియోకవర్గంతో టమాట, మిరప ఏడాది పొడువునా సాగులో ఉంటుంది. విత్తనంతో నారు పోస్తే పంటల సాగుకు ఆలస్యం అవుతుందని రైతులు నర్సరీల వైపు పరుగులు తీస్తున్నారు. దీంతో నర్సరీలు నిర్వహణ వ్యాపారంగా మారిపోయింది. రొద్దం మండలంలోని ఉన్న నర్సరీల్లో మొక్కలను బట్టి గతంలో ఒక్క మొక్క 50 పైసల నుంచి 70 పైసలకు విక్రయించేవారు. ఇప్పుడు 75 పైసల నుంచి రూపాయి మధ్య ధర పలుకుతోంది.



రొద్దం సమీపంలోని ఓ టమాట నర్సరీ

సమయం ఆదా అవుతుందనే..



గతంలో టమాట, మిరప, వంగ సాగుకు విత్తనంతో నారు పోసేవాళ్లం. పొలంలో దిబ్బ ఎరువులతో, దుక్కిచేసిన చోట విత్తనం చల్లి మొక్కలయ్యాక నాటే వాళ్లం. ఇప్పుడు నారుపోసే రైతులు ఎవరూ లేరు. ప్రతి ఒక్కరూ నర్సరీలపై ఆధారపడి టమాట, మిరప పంటలను సాగు చేస్తున్నారు. మొక్కలు కొనడం వల్ల పెట్టుబడి వ్యయం పెరుగుతోంది. సమయం ఆదా అవుతోందని ఇలా చేస్తున్నారు.

– కృష్ణమూర్తి , రైతు, రొద్దం

ఏటా 6 లక్షల మొక్కల విక్రయం



ప్రస్తుత పరిస్థితుల్లో దాదాపుగా రైతులందరూ నర్సరీకే వచ్చి మొక్కలు కొంటున్నారు. ఐదేళ్లుగా టమాట, మిరప, వంగ, మల్లె పూల మొక్కల నర్సరీని నిర్వహిస్తున్నాను. ఏడాదికి 6 లక్షల టమాట, మిరప మొక్కలు విక్రయిస్తుంటాం. పంటకు మంచి ధర పలికితే మొక్కల విక్రయం ధర పెరుగుతుంది. టమాట ధర పడిపోతే మొక్క 50 నుంచి 70 పైసలకు పడిపోతుంది.

– శ్రీనివాసులు, నర్సరీ నిర్వాహకుడు, రొద్దం



డిగ్రీ కళాశాలకు సింగిల్ మేజర్ కోర్సుల కేటాయింపు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రగతి

హిందూపురం టౌన్: పట్టణంలోని ఎస్‌ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు ఎనిమిది సింగిల్ మేజర్ కోర్సులు కేటాయిస్తూ ఉన్నత విద్యా మండలి కమిషనర్ ఆమోదం తెలిపినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ప్రగతి తెలిపారు. మంగళవారం స్థానిక కళాశాలలో ఆమె విలేకరులతో మాట్లాడారు. నూతనా జాతీయ విధానంలో భాగంగా 2023–24 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలో అన్ని డిగ్రీ కళాశాలల్లో ప్రధాన సబ్జెక్టుల స్థానంలో ఒకే సబ్జెక్ట్ అంశంగా సింగిల్ మేజర్ డిగ్రీ కోర్సులు అమల్లోకి రానున్నట్లు పేర్కొన్నారు. ఇవేకాకుండా మల్టీ డిసిప్లినరీ కోర్సులు, నైపుణ్యాభివృద్ధి అంశాలు కూడా చదవాల్సి ఉంటుందన్నారు. తప్పనిసరిగా 8 నెలల ఇంటర్న్‌షిప్ పూర్తి చేయాలన్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీ పూర్తి చేస్తే పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో రెండో ఏడాదిలో నేరుగా ప్రవేశం పొందవచ్చన్నారు. మూడేళ్ల తర్వాత సాధారణ డిగ్రీతో నిష్క్రమణకు అవకాశం ఉంటుందన్నారు. ఈ నెల 19 నుంచి డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, మరిన్ని వివరాలకు కళాశాలలోని హెల్ప్‌లైన్ సెంటర్ ఫోన్ నంబర్లు 9704575721, 9866876245లను సంప్రదించాలన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

- ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్



విద్యార్థులకు విద్యా కానుక కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ ఇక్బాల్

హిందూపురం: వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యపై సామాజిక పెట్టుబడి పెట్టి ఎన్నో పథకాలు ప్రారంభించి విద్యాభివృద్ధికి కృషి చేస్తోందని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. హిందూపురం మండల కిరికెర బసవన్నపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ భాగమ్మ అధ్యక్షతన మంగళవారం విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను గ్లోబల్ సిటిజన్స్‌గా తీర్చిదిద్దేవిధంగా నైపుణ్యాలతో కూడిన విద్యను బోధిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ బడుల్లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌ను తీర్చిదిద్దేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. 25–30 ఏళ్లలో వచ్చే మార్పులకు అనుగుణంగా దానికి విద్యా వ్యవస్థను తీర్చిదిద్దాలనే ఆలోచన కల్గిన నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. టీవీలు, సెల్‌ఫోన్లు అకతాయి చెష్టలకు స్వస్తి పలికి భవిష్యత్తుపై దృష్టి సారించి బాగా చదవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేంద్ర, ఎంఈఓ గంగప్ప, జెడ్పీటీసీ నాగభూషణం, ఎంపీటీసీ కవిత, వైస్ ఎంపీపీ రామాంజి, సర్పంచ్ ఆనంద్, స్కూల్ కమిటీ ప్రెసిడెంట్ సరిత, మల్లేష్, , మాజీ మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న 'విద్యా కానుక' పంపిణీ

పరిగి: మండలంలోని శ్రీరంగరాజుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను మంగళవారం ప్రధానోపాధ్యాయుడు వెంకటేశులు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. మండల వైస్ ఎంపీపీ వేదవతి, సర్పంచ్ మల్లక్క, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ సర్పంచ్ మురళీమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: మండలంలోని గుట్టూరు హైస్కూల్‌లో సర్పంచ్ నాగరత్నమ్మ చేతుల మీదుగా విద్యార్థులకు విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగార్జునుడు, ఎంపీటీసీ సభ్యురాలు నిర్మల తదితరులు పాల్గొన్నారు.

పరిగి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు జగనన్న విద్యా కానుక కిట్లను సకాలంలో పంపిణీ చేయడం హర్షణీయమని మైనింగ్ అడిషనల్ డైరెక్టర్ రామ్మోహన్‌రావు, కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి (సీఎంఓ) ఓబుళపతి అన్నారు. మంగళవారం పరిగిలోని జగనన్న విద్యాకానుక కిట్ల స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు.

'రాగి'ని విరివిగా సాగు చేయండి

అమరాపురం/మడకశిరరూరల్/గుడిబండ/: రాగి పంటను విరివిగా సాగు చేయాలని సివిల్ సప్లయిస్ డీఎం అశ్వర్థనారాయణనాయక్ రైతులకు సూచించారు. రాగి పంటపై అవగాహన సదస్సులో భాగంగా మడకశిర రూరల్, అమరాపురం, గుడిబండ మండలాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా రైతు భరోసా కేంద్రాలను సందర్శించడంతో పాటు రాగి పంటను విరివిగా సాగు చేసుకునేలా రైతులకు అవగాహన కల్పించారు.

పెనుకొండ రూరల్: రాగిని సాగు చేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ విద్యావతి తెలిపారు. మంగళవారం గోనిపేట, కోనాపురం రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు రాగి పంటపై అవగాహన కల్పించారు.



గుడిబండ: అధికారులతో సమావేశమైన సివిల్ సప్లయిస్ డీఎం అశ్వర్థనారాయణనాయక్

రొళ్ల: ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేయనున్న రాగి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వీఏఏ ప్రసన్నకుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని 11వ ఆర్‌బీకే పరిధిలోని రైతులకు రాగి విత్తనాల పంపిణీని ఆయన ప్రారంభించారు.

నిర్మాణాలు వేగవంతం చేయండి

రొద్దం: మండల పరిధిలోని తురకలాపట్నం, రొద్దం వైఎస్సార్ జగనన్న లేఅవుట్లలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను మంగళవారం మండల ప్రత్యేక అధికారి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పరిశీలించారు. ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలన్నారు.

నిబంధనలు పాటించండి

పెనుకొండ రూరల్: వాహనదారులు రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలని కియా ఎస్‌ఐ వెంకటరమణ సూచించారు. మంగళవారం 44వ జాతీయ రహదారి నయారా పెట్రోల్ బంక్ ఎదురుగా, అమ్మవారిపల్లి నుంచి గుట్టురుకు వ్యతిరేక దిశలో వస్తున్న వాహనదారులను గుర్తించారు. ఇందులో భాగంగానే ఒక్కొక్కరికీ రూ.వెయ్యి చొప్పున 30 మందికి జరిమానా విధించారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



వానవోలులో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ



నిద్రగట్టలో గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

- ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ

గోరంట్ల: పేదల అభ్యున్నతే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ అన్నారు. ప్రజాధరణ కోల్పోతున్న ప్రతిపక్ష పార్టీలు, వాటికి కొమ్ముకాస్తున్న పచ్చ పత్రికలు అసత్యాలను ప్రచారం చేస్తూ తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని, వాటిని నమ్మొద్దని ప్రజలకు సూచించారు. మండలంలోని వానవోలు గ్రామంలో మంగళవారం సర్పంచ్ శ్రీరాములు నేతృత్వంలో ఎమ్మెల్యే శంకరనారాయణ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం జరిగింది. ప్రతి గడపకూ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించడంతో పాటు స్థానిక సమస్యలను ఆయన తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరనారాయణ మాట్లాడుతూ పేదల సంక్షేమ కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఆదుకుంటుంటే ప్రతిపక్ష పార్టీలు, వాటికి కొమ్ముకాస్తున్న పచ్చ పత్రికలు ఓర్వలేకపోతున్నాయని విమర్శించారు. ప్రజలను తప్పుదోవపట్టించే ప్రయత్నాలు చేస్తున్నాయని, వాటిని ప్రజలు తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు పాలే జయరాంనాయక్, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఫక్రుద్దీన్ సాహెబ్, జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, మండల ఉపాధ్యక్షులు నాగభూషణరెడ్డి, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు డాక్టర్ బాషా, బూదిలి సహకార సంఘం అధ్యక్షులు రఘురామిరెడ్డి, వానవోలు సహకార సంఘం అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు హరినాథ్ , డీలర్ రాఘవేంద్రస్వామి, ఉప సర్పంచ్ బూలేట్ బాబు, తహసీల్దార్ రంగనాయకులు, ఎంపీడీఓ రఘునాథగుప్త తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల కుట్రలు తిప్పి కొట్టండి

- ఎమ్మెల్యే తిప్పేస్వామి

అమరాపురం: 'ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి పేదల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తోంది.. తమ ఉనికే ప్రశ్నార్థకంగా మారిన పతిపక్ష పార్టీలు ఎలాగైనా వచ్చే ఎన్నికల్లో గెలవాలని కుట్రలు, కుతంత్రాలు, కుళ్లు రాజకీయాలు, కుల రాజకీయాలు చేస్తున్నాయి.. వారు చేస్తున్న కుట్రలను ప్రజలు తిప్పికొట్టి పేదలకు మంచి చేస్తున్న వైఎస్సార్‌సీపీని మరోసారి ఆశీర్వదించాలి' అని ఎమ్మెల్యే తిప్పేస్వామి అన్నారు. మంగళవారం మండలంలోని నిద్రగట్ట గ్రామ సచివాలయాల పరిధిలోని ఎస్సీ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, ఎస్.గొల్లహట్టి తదితర కాలనీల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. సంక్షేమ లబ్ధిని వివరించడంతో పాటు గ్రామంలో నెలకొన్న సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో పేదలకు దక్కాల్సిన సంక్షేమ, అభివృద్ధి ఫలాలు పచ్చచొక్కాలకే పరిమితం అయ్యాయని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చేపట్టిన అవినీతికి తావు లేకుండా నేరుగా లబ్ధిదారుల ముంగిటకే సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, డైరెక్టర్ గగన, ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, ఎంపీటీసీ అనసూయమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు శివలింగప్ప, బరగూరప్ప, నారాయణ, ప్రసాద్, చిత్తన్న, త్రిలోక్‌నాథ్, శివకుమార్, జేసీఎస్ మండల కన్వీనర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో కవలల జననం



కవల పిల్లలను చూపిస్తున్న ఆశా కార్యకర్త

పావగడ: తాలూకాలోని వైఎన్ హొసకోట హోబళి జే అచ్చమ్మనహళ్లి చెందిన లక్ష్మీ అనే గర్భిణీకి నొప్పులు వచ్చాయి. దీంతో అంబులెన్స్‌లో సోమవారం రాత్రి వైఎన్ హొసకోట పీహెచ్‌సీకి తరలించారు. అయితే ఆమెకు కాన్పు చేయడం కష్టమని పావగడలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాలని ఆరోగ్య సిబ్బంది చెప్పడంతో రాత్రి 12 గంటల సమయంలో పావగడ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే కవల పిల్లల (ఆడ, మగ)కు జన్మనిచ్చింది. ఆరోగ్య కార్యకర్త నాగేంద్ర కుమార్, ఆశా కార్యకర్త నాగమణి, డ్రైవర్ హనుమంతరాయప్ప ఆమెకు కాన్పు చేశారు. దీంతో లక్ష్మీ కుటుంబ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

'నారాయణ'పై చర్యలు తీసుకోవాలి



నారాయణ జూనియర్ కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

హిందూపురం టౌన్: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న నారాయణ జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఇందులో భాగంగానే మంగళవారం నారాయణ జూనియర్ కళాశాల ఎదుట ధర్నా చేశారు. ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి మాట్లాడుతూ ఎంసెట్, జేఈఈ లంటూ రూ.35 వేల నుంచి రూ.50 వేలు వరకు అదనంగా ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. మెటీరియల్ పేరుతో రూ.8 వేలు వసూలు చేస్తున్నారని విమర్శించారు. క్రీడామైదానం, సైకిల్ స్టాండ్, లైబ్రరీ, పీఈటీ, సౌకర్యాలు కూడా లేవన్నారు. వెంటనే నారాయణ కళాశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ నాయకులు జయచంద్ర, చంద్రశేఖర్, హర్ష కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

సోమందేపల్లి: మండలంలోని జూలకుంట గ్రామ సమీపంలో మంగళవారం కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు అక్రమంగా కర్ణాటక నుంచి మద్యం తీసుకు వచ్చి విక్రయిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. అయితే పోలీసులు రావడాన్ని గ్రహించి ఇద్దరు వ్యక్తులు పరారుకాగా వారి ఇళ్ల వద్ద నిల్వ ఉంచిన 345 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

పరిగి: అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు. మండల కేంద్రంలోని సుబ్రహ్మణ్యస్వామి గుడి వద్ద హిందూపూరం – పరిగి రోడ్డులో మంగళవారం తనిఖీలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగానే కాలువపల్లికి చెందిన గంగాధర అక్రమ మద్యంతో పట్టుబడినట్లు చెప్పారు. ద్విచక్ర వాహనంతో పాటు 60 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని గంగాధరను రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

అసమ్మతి నేతల సమావేశం

పెనుకొండ: జిల్లా టీడీపీ అధ్యక్షుడు, పెనుకొండ మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథికి వ్యతిరేకంగా అసమ్మతి నేతలు మంగళవారం పెనుకొండలో సమావేశమయ్యారు. త్వరలో టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటన ఉన్న నేపథ్యంలో వారు పలు విషయాలపై చర్చించారు. నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితి, అసమ్మతి, కారణాలు, గతంలో వచ్చిన ఓట్ల శాతం తదితర వాటిపై చంద్రబాబుకు రిపోర్ట్ ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది.

నేడు పావగడకు డిప్యూటీ సీఎం

పావగడ: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ బుధవారం పావగడలో పర్యటించనున్నట్లు స్థానిక కాంగ్రెస్ నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. తాలూకాలోని నాగలమడక, తిరుమణి, వళ్లూరు గ్రామ పంచాయతీల పరిధిలో నిర్మించిన సోలార్ పార్క్‌ను వీక్షించనున్నట్లు పేర్కొన్నారు. ఆయనతో పాటు ఇంధన శాఖా మంత్రి కేజే జార్జ్ రానున్నట్లు తెలిపారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెనుకొండ: అర్హులైన సగర (ఉప్పర) విద్యార్థులు ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని భగీరథ సేవా ట్రస్టు నిర్వాహకులు తెలిపారు. 10వ తరగతిలో ప్రభుత్వ పాఠశాలలో చదివిన వారు. 400 మార్కులు, ప్రైవేట్ పాఠశాలలో చదివిన విద్యార్థులు 450 మార్కులు, ఇంటర్‌లో రెండు సంవత్సరాలకు కలిపి ప్రభుత్వ కళాశాలలో 650 మార్కులు, ప్రైవేట్ కళాశాలలో 700 మార్కులు వచ్చిన విద్యార్థులు అర్హులన్నారు. వివరాలకు 8008544627 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

లభ్యం కాని చిన్నారి ఆచూకీ

పెనుకొండ: పట్టణంలోని దర్గాపేటకు చెందిన షాఫీయా (4) సోమవారం అదృశ్యమైన సంగతి తెలిసిందే. అయితే మంగళవారం కూడా పోలీసులు, తల్లిదండ్రులు పలు ప్రాంతాల్లో గాలించినా షాఫియా ఆచూకీ తెలియలేదు. చిన్నారిని దర్గాకు వచ్చే భక్తులు ఎవరైనా ఎత్తుకెళ్లారా? లేక సమీపంలోని నీటి కుంటలలో ఏమైనా ప్రమాదవశాత్తూ పడిపోయిందా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. చిన్నారి అదృశ్యంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు.

అవన్నీ అవాస్తవాలే..

గుడిబండ: 'మడకశిర నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ అసమ్మతి నాయకులు ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామిపై చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మొద్దు' అని సింగల్‌విండో అధ్యక్షుడు చంద్రశేఖర్, సర్పంచ్‌లు యంజారేగౌడు, లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మూడు రోజుల క్రితం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసిన వైఎస్సార్‌సీపీ అసమ్మతి నేతలు ఎమ్మెల్యేపై చేసిన ఆరోపణలు అవాస్తవమన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేకు టికెట్ రాదనడం సరికాదన్నారు.

డ్రిప్ నాణ్యతపై అవగాహన

పెనుకొండ: వివిధ డ్రిప్ కంపెనీల ద్వారా సరఫరా అయిన పరికరాలు నాణ్యతతో రైతులకు చేరాయా? లేదా ? అన్న విషయాన్ని మెటీరియల్ ఫిట్టర్లు పరిశీలించాలని ఏపీ ఎంఐపీ పీడీ సుదర్శన్ తెలిపారు. పట్టణంలోని హార్టికల్చర్ కార్యాలయంలో మంగళవారం డ్రిప్ నాణ్యతపై నిరుద్యోగ యువతకు అవగాహన కల్పించారు.

స్కానింగ్ సెంటర్ల తనిఖీ

హిందూపురం టౌన్: ప్రభుత్వ నిబంధనల ప్రకారం లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని జిల్లా ఆరోగ్య కార్యక్రమాల, స్కానింగ్ కేంద్రాల తనిఖీ అధికారి కుళ్లాయప్ప నాయక్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని పలు స్కానింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. అనుమతి పత్రాలు, స్కానింగ్ యంత్రాలను తనిఖీ చేశారు.